# ఆమెదనంతపురం

**అనంతపురం** నా గుండె మీద కాణీకాసంత మచ్చ. ఏదో బెంగ. వర్షం ఇష్టంనాకు. ఖాళీరోడ్ల మీద వర్షంలో ఒంటిగా నడుస్తూంటాను. ("మీరు బాగానే వుంటారు. మిమ్మల్ని చూసి పిల్లలు చెడిపోతున్నారు") కిటికీ దగ్గిర నుంచుని వర్షంలోంచి అనంతపురం వేపు చూస్తాను. దట్టమైన జిగట బెంగ. కిటికీ అవతల గాలికి ఊగుతున్న వెండితాళ్లని ఒక్క గంతులో పట్టుకుని ఊగుతూ టార్జాన్‌లా బయలుదేరాను. మహా అయితే కృష్ణ వరకూ, తరవాత అంతా వేడిశూన్యం. ఊగుతూ ఇంటికి మళ్లా. వర్షం ఎప్పుడు పడ్డా ఇంతే.

క్రితం వేసవిలో హార్స్‌లీ వెళ్లాం ఇద్దరం. రాత్రి తను త్వరగా పడుకుంది. మూడు సిగరెట్ల తరవాతనేనూను. ఎందుకో చటుక్కున మెళకువ వచ్చింది. గదంతా నీలపు కాంతిలో వెచ్చగా పలచగా పట్టుకుంటే చిరిగిపోయేట్టుంది. లేచి కూచుని తలుపువేపు చూశాను. అలాగే చూస్తూండిపోయాను. పొడవాటి తలుపుల కింద నుంచి సముద్రపు అల ఏదో లోపలికి వచ్చే ప్రయత్నంలో వుంది. పక్కకి చూస్తే మా ఆవిడ తెల్లటి దుప్పటికి పూచిన చామనచాయ నిద్రలా వుంది. తలుపు కింద అలాగే తెల్లటి నురుగు. నిశ్శబ్దంగా లేచి జాగ్రత్తగా తలుపు తీసి బయటికి అడుగుపెట్టి వెనకాల తలుపు వేశాను. నా గుండె ఆగి కొట్టుకుంది. నా రక్త మాంసాల్నీ, చర్మాన్నీ చీల్చుకుంటూ పెద్ద తెల్లటి పిట్ట కొండలవేపు ఎగిరిపోయిందనుకుంటాను. నా శరీరం తేలికపడి ఈలోకపు ఆవరణం దాటి వెళ్లిపోయింది. ఎదురుగా పొడవాటి కారిడార్ నిండా మెత్తగా లుంగలు చుట్టుకుంటూ నా తలపును తాకుతున్న మబ్బుల గుంపులు. ఏదో సముద్రం పొంగి కొన్ని అలలు మిగిలిపోయినట్టున్నాయి. ఆ చివర్నించి ఈ చివరి దాకా నడిచి ఒచ్చేను. నా కాళ్ల చుట్టూ పల్చగా చల్లటి రెక్కలు తొడుగున్నాయి. కారిడార్ ఆకాశ సముద్రంలా వుంది. భుజం మీద సున్నితంగా వాలిన పెద్ద మబ్బు ముక్కని రహస్యంగా అడిగేను.

"మీరు అనంతపురం జిల్లా వెళ్లేరా?" మా ఆవిడ నన్ను అపుడ్పుడు పూలంటుంది. తరచుగా పిశాచాన్నంటుంది.

ఒళ్లు చల్లగా అనిపించింది. బద్ధకంగా కుడికన్ను తెరిచాను. మామూలే. ఎండిపోయిన బూడిద రంగులో నెర్రెలు తీసిన అనంతపురం జిల్లాని నిలువునా చీలుస్తూ ఎర్రటి పెద్ద ఆరుద్ర పురుగులా బస్సు నడుస్తూనే వుంది. ఎండ బయట పొలాలు చూస్తుంటే పసిపిల్లలు దహనం అయినట్టున్నాయి. కుడిరెప్ప దానికదే మూసుకుపోయింది. నా పక్కరైతు తలపాగా

దిండుతో నిద్రలో వున్నాడు. ఒళ్లు చల్లగావుంది. కళ్లు మళ్లీ వాటంతట అవే తెరుచుకున్నాయి. బస్సులో అరడజను మంది వుంటారు. కండక్టరు బయటికి చూస్తున్నాడు. ఎదుటి సీటు వేపు అప్పుడు చూశాను. బద్ధకం ఎగిరిపోయి గుండె టల్లుమంది. ఆమె బయటికి చూస్తోంది. నేనామెని చూస్తున్నానని ఆమె స్త్రీ చర్మానికి తెలిసి మెల్లిగా తల తిప్పి నా వేపు చూసింది. నా గుండె దడదడలాడింది. బహుశా ఆమెకి ముప్ఫై అయిదేళ్లుంటాయేమో. పసుపుపచ్చటి చేనేత చీరలో, పల్చటి చామనచాయ శరీరంతో నిజానికామె వయసు చెప్పడం కష్టం. జిల్లా మొత్తం పరుచుకోగల నల్లటి పెద్ద కళ్లు కాటుక వల్ల వెలిగిపోతున్నాయి. మళ్లీ బయటికి చూస్తోందామె. నూనె పెట్టిన నల్లటి జుట్టు మెడమీద శిగచుట్టింది. ఆమె మొత్తానికి మూడు వందల సంవత్సరాలు జీవించి మళ్లీ ఈ లోకపు కాలమాన ప్రకారం ముప్ఫై అయిదేళ్లకి సరిపడినట్టుంది. అంత వేడిలో ఆమె నుదురు నిర్మలంగా వుంది. రెండు చేతులకీ నీలం, ఎరుపు రంగుల కొత్త గాజులు మెరిసిపోతున్నాయి. ఒళ్లో నిశ్చలంగా వున్న ఆమె చేతులు చూశాను. పొడవాటి వేళ్లు. సరిగా కూచుని కళ్లు మూసుకు తెరిచి మళ్లీ ఆమెవేపు చూశాను. వెలుగువస్తూండగానే ఉదయిస్తోన్న సూర్యుణ్ని తెంపి నుదుట అద్దుకుందనుకుంటాను. కుంకుమ బొట్టు ఆమె శరీరంలోని విద్యుత్తుతో ఇంకా వెలిగిపోతోంది.

నేను దరిదాపు ఈ దేశం అంతా తిరిగిన వాణ్ని. ఒకసారి ఒక సంధ్య వేళ ఖజురహ ఆలయం దగ్గిర నెత్తిమీద నీటి కుండతో వెడుతోన్న ఒక స్త్రీ చూశాను. పాటలాంటి ఆమె నడక, నీళ్లు పడి మెరిసిపోతున్న ఆమె ముఖం, నడుం- వెనక ఆలయం గోడలోంచి ఊడిపడ్డట్టుగా ఉందామె. తరువాత కొన్నేళ్లకి ఒక రాజస్థాన్ గ్రామంలో మరో స్త్రీని చూశాను. ఇసకలోంచి పుట్టిన తామరపువ్వు ఆమె. నేనీ జీవితంలో ఆ ఇద్దరికంటే అందమైనన స్త్రీలని చూడగలనని అనుకోలేదు. కానీ ఈ వేసవి మధ్యాహ్నం ఒక దగ్ధ జీవావరణలో చేయి చాస్తే తాకేటంత సామీప్యంలో ఎవరీమె! అలా బయటికి చూస్తూ ఎందుకో ఆమె పెదాలు చిరునవ్వుతో కదిలేయి. అప్పుడుగాని చూడలేదు. ఈ లోకంలో ఉన్న అన్ని చిరునవ్వులకూ పుట్టిల్లు ఆమె పెదాలు. పెన్సిల్‌తో కూడా అటువంటి ముద్దు పెదాల్ని గీయడం సాధ్యం కాదు.

ఒక్క క్షణం కళ్లు మూసుకున్నాను. వర్షపు జల్లుతో చల్లబడ్డ పూసిన తంగేడు చెట్టూ, పెద్ద ఎమలీ స్ఫురించేయి. కళ్లు తెరిచి కండక్టరు వేపు చూశాను. చటుక్కున తలతిప్పి ఆమె వేపు చూశాను. నిజమే ఇది. ఆమె అక్కడే వుంది. నేను జోగుతున్నప్పుడు ఎక్కడో ఎక్కివుంటుంది. మెరుస్తూ గాజులు గల్లుమన్నాయి. ఆమె కుడిచేతి మణికట్టు కింద గుండ్రటి నల్లపుట్టుమచ్చ. బస్సు ఆగింది. నా పక్కనున్న రైతు లేచి దిగి వెళ్లి పోయాడు. అతను దిగుతుంటే కన్నార్పకుండా చూసిందామె. పుచ్చిపోయిన నాగలి లాగుతున్నాడతను.

వెనక ఫల్చటి చొక్కలో పెద్ద చిరుగు. బస్సు బయలుదేరగానే నా వేపోసారి చూసిందామె. నవ్వడానికి ప్రయత్నించాను. నేను మళ్లీ కళ్లు మూసుకునే ఆమెను చూసుకుంటున్నాను.

అయిదు నక్షత్రాల హోటల్లో సెమినారుహాలు చల్లగా ప్రాణానికి హాయిగా వుంది. ప్రపంచబేంకు రాష్ట్రప్రభుత్వం చేతేర్పాటు చేయించిన సదస్సు. వేదిక చుట్టూరా ఎర్రటి పూలకుండీలు. పి.ఎన్.మిశ్రాగారు అనంతపురం జిల్లాలో నీరునేల సంరక్షణ గురించి బొమ్మలు చూపిస్తూ మాట్లాడుతున్నారు. లేత నీలంరంగు కుర్తా, వెలిసిపోయిన జీన్స్‌పేంటులో మిశ్రాజీ ఐస్‌క్రీమ్ కోన్‌లా వున్నాడు. నేను ఆయన చెప్పేది వినడం మానేసి చాలాసేపే అయింది. ఎక్కువ శబ్దం కాకుండా మోగిన కరతాళధ్వనుల వల్ల ఆయన ప్రసంగం అయిపోయిందని అర్థమైంది. కేంద్రీయ జలవనరుల కమీషన్ అధ్యక్షులు ప్రారంభించారు. అనంతపురం జిల్లా కొన్ని దశాబ్దాల నుంచీ కరువుతో క్షీణించి పోవడంచేత ఇకనైనా ఈ దుస్థితికి నిజమైనకారణాలు తెలుసుకోవాలనీ, ఈ విధ్వంసాన్ని నిరోధించాలనీ చెప్తూ ప్రపంచబేంకు నిధుల్ని సద్వినియోగం చెయ్యవలసిన బాధ్యతల్ని గుర్తు చేస్తూ జిల్లా పటాన్నీ,దాన్నిండా ఎర్ర గుర్తులతో శిలువ వేయబడ్డ గ్రామాల్ని చూపించారు. కాసేపటికి వేడి టీ అందరికీ ఇస్తూండగా, రాష్ట్రప్రభుత్వ నీటి పారుదల విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ మరి కొన్ని బొమ్మలుచూపించడానికి లేచేడు. పూర్వాశ్రమంలో ఆయన అనంతపురం కలెక్టరుగా చేశారు. టీ కప్పులో జిల్లా దారిద్ర్యం, కరువు, నేల విధ్వంసం మొదలైనవి ఇంగ్లీషులో పడుతున్నాయి. చప్పరిస్తూ కూచున్నాను. టీ చిక్కటి ఎర్రటి కాలవ నీళ్లలా వుంది. కొద్దిగా అనంతపురం జిల్లా కప్పులో ఒదిలేసి కుర్చీ కిందపెట్టేను. నేను హైడ్రోజియాలజిస్టుని. భోజన విరామం వరకూ ప్రసంగాలు సాగేయి. కింద హాల్లో అనేక రకాల శాకాహార మాంసాహారాలతో కమ్మటి పరిమళం వ్యాపించింది. ఓ మూలకూర్చుని ఐస్‌క్రీం చప్పరిస్తున్నాను. నా వెనక సోఫాలో ఇద్దరు స్వచ్ఛంద సేవాసంస్థలవారు ప్లేట్లనిండా భోజనంతో తీవ్రంగా మాట్లాడుకుంటున్నారు. ఎదురుగా ప్లేటుతో వచ్చి మిశ్రాగారు పలకరించారు.

❖ ❖ ❖

సెమినారు జరిగిన మూడో రోజు బయల్దేరేను. నేను కొత్తగా చూడవలసిందీ తెలుసుకోవలసిందీ లేదు. ఉద్యోగ ధర్మం. చెరువు గట్టుకింది రోడ్డు మలుపులో ఒక క్షణం ఆగింది బస్సు. కళ్లు తెరిచి ఆమెని చూడాలనిపించింది. కానీ మూసిన కనెప్పల కింద ఆమె స్పష్టంగా కనిపిస్తూనే వుంది. బస్సు మళ్లీ ఆగలేదు. పది సంవత్సరాల నాటి తారురోడ్డు మట్టి రోడ్డు అవడంతో దుమ్ము లేపుతూ మొత్తానికి ఆగింది. నేను ఒక క్షణం ఆమెని కళ్లలో జీర్ణించుకుని మెల్లిగా కళ్లు విప్పేను. సీటు ఖాళీగా వుంది. బస్సు దరిదాపు ఖాళీ. డ్రైవరూ, కండక్టరూ దిగిపోయేరు. రెండు సంచీలూ కిందికి లాగి బస్సు దిగి

కలయచూశాను. చెరువు మలుపులో దిగిపోయి వుంటుంది. నుంచుండిపోయిన నన్ను విచిత్రమైన ఒంటరితనం ఆవహించింది.

సర్పంచి రెడ్డిగారింట్లో నాకూ, మా బృందంలో ముందుగా వచ్చిన ఇద్దరికీ మరో ఇళ్ళలో బస ఏర్పాటు చేశారు. సాయం కాలం ఊళ్లోకీ ఊరి బయటికీ బయల్దేరాం. నాలుగైదేళ్ల క్రితం వచ్చినప్పుడు పలకరించిన కొంతమంది కనిపించలేదు. వాళ్లతో పాటు ఓపిక, సత్తువ వున్న వాళ్లు చాలామంది గ్రామం వదిలివెళ్లిపోయారు. పాత చెక్కతో చేసి ఓ మూల పారేసిన కొండపల్లి పల్లె బొమ్మలా వుంది ఊరు. జిల్లాలో నేను నాలుగుచోట్ల పని చేశాను. వర్షాభావం, దారిద్ర్యం, కమ్ముకొస్తూన్న శైథిల్యం నన్ను విపరీతమైన అలజడికి గురిచేస్తూండేవి. మనుషుల విజ్ఞత మీదా, వ్యవస్థలమీదా నాకు నమ్మకం పోవడానికి అనంతపురమే కారణం. కానీ ఈ సాయంకాలం, అంతకుముందు అనేకసార్లు గ్రామీణుల్లో కనిపించి విచిత్రమైన జీవశక్తి నన్ను ఆశ్చర్యపరిచింది. వాళ్లింకా నవ్వగలుగుతున్నారు!

మర్నాడు ఉదయం పచ్చటి విశాలమైన జొన్న రొట్టె ఇష్టంగా తిని రెడ్డిగారింటి ఆవరణలో చెట్టు కింద పడక కుర్చీలో వాలేను. మా వాళ్లింకా రాలేదు. ఆకాశం క్రమంగా ఎండకి నీలం అవుతోంది. చెట్టుమీదకాకి ఎవర్నో మూడు సార్లు పిలిచింది. ఒళ్లో చటుక్కున తడిసిన తంగేడుపూల గుత్తి పడింది. ఎదురుగా అదే పసుపురంగు చీరలో ఈసారి తల్లో పూలు పెట్టుకుని సాక్షాత్క రించిందామె. నా చుట్టూ హాయిగా ఏదో చల్లటి బుడగలో వున్నట్టుంది. చిన్నగా నవ్వి ఆమె ఏదో అంది. పై నుంచీ ఒక పెద్ద వర్ష బిందువు నెత్తిమీద పడి పల్చబడుతున్న జుత్తుమీంచి జారి మెడ మీద పడింది. చేత్తో తల తుడుచుకుంటూ పైకి చూశాను. ఖాళీ ఆకాశం. మళ్ళీ కాకి అరుపు. టప్పున కనురెప్పలు విచ్చుకున్నాయి. జుట్టలోంచి చల్లగా మెడ తడిసింది. కళ్లు నులుముకుని లేచేను. మావాళ్లింకా రాలేదు.

తరువాత అందరం ఊళ్లోకి బయల్దేరేం. కొండకింది వాలు, ఎండిపోయిన ఊరి చెరువు, తెగిన చేతుల్లాంటి బోరు పంపులు అన్నీ చూసి, రైతులతో మాట్లాడి మళ్లీ ఊళ్లోకి వచ్చే సరికి మధ్యాహ్నం అయింది. ఊళ్లో ఎదురైన ప్రతి స్త్రీనీ, ప్రతి గుమ్మాన్నీ ఎంత కళ్లప్పగించి చూసినా ఆమె జాడ కనిపించలేదు. సాయంత్రం అయిదు గంటలవుతుండగా సర్పంచిగారి కోసం ఇద్దరు మనుషులొచ్చేరు. ఆయన అప్పుడే నిద్రలేచాడు.

"ఏమిరా, ఏంది?"

"అయ్యా! పిచ్చి లచ్చుమ్మ చనిపోయుండాది. మన పొలంకాడ బావి దగ్గర పడుండాది"

"దీనియమ్మ. సరే పదండి. ఆళ్లకి చెప్పండి"

వాళ్లిద్దరూ వెళ్లిపోయారు. వరండాలో కూచున్న నన్నుచూస్తూ రెడ్డిగారు చెప్పేరు–

"అదో పిచ్చిముండ. ఊరంతా తిరుగుతా ఉంటది. ఎవరో ఒకళ్లం ఒంత కూడూ, నీళ్లూ ఏసేవాళ్లం. యమ్మ, నా బావిదగ్గర్నే చావాల్నా"

ఆయనతో పాటునేనూ బయల్దేరేను. చచ్చిపోయినవాళ్లని చూడ్డానికిఎందుకింత ఇష్టపడతా? పెద్ద ఎండిపోయిన బావి. పొలం శాశ్వతంగాదాహంతో నోరు తెరిచి ఉండిపోయినట్టుంది. బావి పగుళ్లు తీసిన పళ్లెం మీద బోర్లాపడి వుందామె. మొహం మీద జుట్టుపడి కనిపించడం లేదు. కుడిచెయ్యి తల పక్కన చాచి ఉంది. అప్పటికే పదిమంది పోగయ్యేరు. బక్కపలచటి శరీరం. మట్టికొట్టుకుపోయి చీలికలైన పాదాలు, వెలిసి దరిదాపు వాలికలైన పసుపురంగు చీర. నిర్జీవంగా చాచి వున్న ఆమె కుడిచేతి మణికట్టు కింద గుండ్రటి పుట్టుమచ్చ. పచ్చబొట్టేమో అనుకున్నాను. కానీ స్పష్టంగా కనిపిస్తోంది. ఒకసారి వెనక్కి తిరిగి అందర్నీ చూశాను. దూరంగా బావివేపు వస్తూ జనం కనిపించేరు రెడ్డిగారు. ఆదేశాలు జారీ చేస్తున్నారు. నేను గుంపు వెనక్కి వెళ్లి నిలబడ్డాను. ముఖం అంతా చెమటతో తడిసిపోయింది.

బాగా చీకటి పడిం తరవాత ఎవరో లచ్చమ్మని పూడ్చిపెట్టేరని చెప్పి వెళ్లేరు. మరో రెండురోజులనుకున్నది మూడున్నర రోజులుపట్టింది. మొత్తం నాలుగు గ్రామాలు తిరిగేం. ఎండపడకుండా ఉదయం మొదటి బస్సుకి వెళ్లమన్నారు రెడ్డిగారు. ఆదివారం. అయిదు దాటుతుండగా బస్సు బయలుదేరింది. అప్పటికే బూడిదలా తెల్లబడుతోంది ఊరు. మేం తప్ప బస్సులో ఎవరూ లేరు. కాళ్లు రెండూ ఎదుట సీట్లో పారేసి తలో బెంచి మీద విశ్రమించాం. గాలి చల్లగా వుంది. కళ్లు మూతలుపడుతుండగా బస్సు వెనకనుంచి వచ్చి నా ఎదురుగా నుంచుందామె. అదే పసుపు చీర. అవేపూలు. మామూలుగా బయటికి చూస్తోందామె. ఆమె కాటుక కళ్లలోంచే ఉదయం అవుతుందనుకుంటాను. అలా చూస్తూండిపోయాను. అనేక నదీ నదాలు ఆవిరై ఆమె మెడకింద భారంగా ఘనీభవించాయి. ఒళ్లో చేతులు పెట్టుకుని గాజులుసర్దుకుంటూ నావేపు చూసింది. నేను ఆమె కుడిచేతి వేపు, మణి కట్టు కింద పుట్టుమచ్చవేపు చూస్తున్నాను. ఉదయాన్ని ముక్కలు ముక్కలుచేస్తూ బస్సు హారను మోగింది. నా కళ్లు మేలుకొన్నాయి. బస్సు హారను మోగింది. నా కళ్లు మేలుకొన్నాయి. కళ్లు విప్పితే ఏమవుతుందో నాకు తెలుసు. కళ్లు విప్పేను. ఆమె ఎదురుగా కిటికీలోంచి బయటికి చూస్తూ కూచుని వుంది. తార్రోడ్డు ఎక్కడానికి ముందు చెరువు గట్టు మలుపులో ఆమె బస్సు దిగి వెళ్లిపోయింది.

❖ ❖ ❖